రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళలు. మద్దతు తెలుపుతున్న సిపిఎం, ఐద్వా నాయకులు

తాగునీటి కోసం..!

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- సిపిఎం, ఐద్వా మద్దతు - గంటపాటు రాస్తోరోకో

ఆలూరులోని వడ్డే వీధిలో 20 రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. 167వ జాతీయ రహదారి చెక్ పోస్ట్ వద్ద రాస్తోరోకో చేపట్టారు. సిపిఎం, ఐద్వా నాయకులు మద్దతు తెలిపారు.

వార్త మెయిన్‌లో

డబ్బుంటేనే వైద్యం..!

- 13 రోజులుగా నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవ
- పునరుద్ధరణకు చర్యలు చేపట్టని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న పేదలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్య సేవలందిస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాకపోవడంతో ఈ నెల 10 నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత వైద్య సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేశాయి. డబ్బులు కడితేనే వైద్యం చేస్తున్నాయి. 13 రోజులైనా ప్రభుత్వం ఉచిత సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆరోగ్య శ్రీ పేరును ఎన్‌టిఆర్ వైద్య సేవ పేరుతో దాదాపు 3,045 రకాల వ్యాధులకు వర్తింపజేసింది. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులకు, ఆర్థో, కిడ్నీ, తదితర మేజర్ వైద్య సేవలు ఈ పథకం ద్వారా అందేవి. ఎన్టీఆర్ వైద్య సేవలకు నిధులు పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో ఎపి స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలను ఈ నెల 10 నుంచి నిలిపివేశారు. జిల్లాలో పేరుకుపోతున్న బకాయిలతో నెట్వర్క్ ఆసుపత్రుల నిర్వాహకులు నిర్వహణ భారమైందని, ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయకుంటే నిర్వహిచడం కష్ట సాధ్యమని యాజమాన్యాలు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద చికిత్సలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో వివిధ అనారోగ్య సమస్యలతో వస్తున్న వారికి వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయి. దీంతో కొందరు రోగులు డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందుతుండగా, ఆర్థిక స్థోమత లేనివారు జిజిహెచ్‌లో చేరుతున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రులకు దాదాపు వంద కోట్ల వరకూ బిల్లులు బకాయి ఉన్నాయి. నంద్యాల జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు అందించే నెట్వర్క్ ఆసుపత్రులు దాదాపు 30 ఉన్నాయి. ఈ ఆస్పత్రులకు దాదాపు రూ.70 కోట్ల నుండి రూ.80 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. ఒక్కొక్క ఆసుపత్రికి రూ. 80 లక్షల నుండి రూ. 2 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులకు రూ.10 కోట్ల నుండి రూ. 12 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో ఒక్కొక్క ఆసుపత్రికి ఇచ్చింది కేవలం రూ.3 లక్షల లోపే. కోట్లలో బకాయిలు ఉండడంతో ఎన్టీఆర్ వైద్య సేవలు అందిచలేమని ఆస్పత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నుండి రూ.2,700 కోట్లు నెట్‌వర్క్ ఆసుపత్రులకు రావాల్సి వుంది. బకాయిలు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆస్పత్రుల నిర్వాహకులు విమర్శిస్తున్నారు. 2018-19లో ఉన్న ధరలే ఇప్పటికి కొనసాగుతున్నాయని, దీంతో అత్యధునాతన పరికరాలతో వైద్యం అందించాలంటే కష్టతరమౌతుందని నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టత కరువు

తొలిసారి నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు పది రోజులకుపైగా సమ్మెలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు సమ్మె విరమించబోమని ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో ఎప్పటి నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవ సేవలు పునరుద్ధరిస్తారో తెలీని పరిస్థితులలో జిల్లా ప్రజలు ఉన్నారు.

సంరక్షణ సంస్థలను తనిఖీ చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉన్న చిన్నపిల్లల సంరక్షణ సంస్థలను తరచూ తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మిషన్ వాత్సల్య, మిషన్‌శక్తి అమలుపై కమిటీ మెంబర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ సంస్థలకి ఎంత నిధులు వచ్చాయి. ఏ ఏ వాటికి ఎంత ఖర్చు పెట్టారు?. ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసం ఎంత ఖర్చు పెట్టారు?. పరికరాలు ఏమి అందుబాటులో ఉన్నాయనే వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. జిల్లాలో ప్రైవేటు సంస్థల వారిచే నిర్వహించబడుతున్న చిన్న పిల్లల సంరక్షణ సంస్థలను చివరిగా ఎప్పుడు తనిఖీ చేశారు?. అందుకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. చిన్నపిల్లల సంరక్షణ సంస్థల పర్యవేక్షణ తరచూ జరగాలని అందుకు సంబంధించిన టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. జిల్లాలో రిజిస్టర్ కాని పిల్లల సంరక్షణ సంస్థలను ఏ విధంగా నడిపిస్తున్నారని, వాటిని తనిఖీ చేసి చట్టానికి విరుద్ధంగా ఉండే వాటిని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోక్సో చట్టంకు సంబంధించిన నివేదికలు త్వరితగతిన పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జనవరి 2025 నుండి ఇప్పటివరకు షాపులలో పని చేసే బాల కార్మికులను ఎంతమందిని గుర్తించి పట్టుకున్నారని కలెక్టర్ కార్మిక శాఖ అధికారిని ఆరా తీశారు. 22 మందిని పట్టుకున్నామని కలెక్టర్ కు వివరించగా అంత తక్కువ మంది ఉండరని షాపులను బాగా తనిఖీ చేసి కార్మిక శాఖ చట్టం సక్రమంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్మిక శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి విజయ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, డిఆర్‌డి ఎపిడి రమణారెడ్డి, సిపిఒ భారతి, అదనపు డిఎం హెచ్‌ఒ డాక్టర్ భాస్కర్, డిపిఒ భాస్కర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

ఉత్సాహంగా యువజనోత్సవాలు

- సృజనాత్మకత వెలికితీతకు ఉపయోగకరం : ముఖ్యఅతిథులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర శివారులలోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమశాఖ సెట్కూరు ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగాయి. సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీలు ప్రతి రంగంలో సత్తా చాటుతున్నారన్నారు. ఇక్కడికి వచ్చిన అమ్మాయిలు అన్ని అంశాలలో పాల్గొని విజేతలుగా నిలవాలని కోరారు. యువతలోని సృజనత్మాకత, ప్రతిభ వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగ పాడుతాయాన్నారు. మొదటి బహుమతి పొందిన విజేతలు ఇన్నోవేషన్-సైన్స్ మేళాలో జి.పుల్లయ్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ టీమ్ జానపద నృత్యం గ్రూపులో మల్లికాగ్రూప్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం, దిన్నదేవరపాడు జానపద గీతం గ్రూపులో నమిత గ్రూప్, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ పెయింటింగులో జి.కార్తికేయ, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల పోయెట్రీలో షేక్‌నూర్‌జహాన్, ఉస్మానియా మహిళా కాలేజీ డిక్లమేషన్‌లో టి.కావ్యశ్రీ, లక్ష్మి శ్రీనివాస కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్ స్టోరీ రైటింగ్‌లో వి.పూజిత, జి.పుల్లయ్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ గెలుపొందారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖాధికారి శ్యామ్యూల్ పాల్, జిల్లా ఇంటర్ మీడియట్ బోర్డు రీజియనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ లాలెప్ప, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, జిల్లా టూరిజం అధికారి లక్ష్మినారాయణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శ్రీ మోహన్ కుమార్, జిల్లా నలుమూలల నుంచి వివిధ కళాశాల నుండి 1000 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్ ఆశయ సాధనకు కృషి

- ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్ఆర్ శంకరన్ ఆశయసాధనకు కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఆర్ శంకరన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సాయిఉదయ్ మాట్లాడుతూ ఎస్ఆర్.శంకరన్‌గా ప్రసిద్ధిచెందిన సిరిగలత్తూర్ రామనాథన్ శంకరన్ తమిళనాడులోని తంజావూరు జిల్లా సిరిగలత్తూరు గ్రామంలో 1934, అక్టోబర్ 22న జన్మించారన్నారు. ఎస్ఆర్.శంకరన్ 1957 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. నెల్లూరు జిల్లా కలెక్టరుగా, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేసిన ఆయన 1992లో ఉద్యోగ విరమణ చేశారు. పెళ్ళి చేసుకుంటే పేదల కోసం పూర్తిగా పని చేయాలన్న ఆలోచనకు ఆటంకం కలుగుతుందని బ్రహ్మచారి గానే ఉండిపోయారు. మన రాష్ట్ర ప్రభుత్వంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మూడేళ్లపాటు పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌ను ప్రతిపాదించినా శంకరన్ తిరస్కరించారు. 1987లో నక్సల్స్ ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ మావోయిస్టు పార్టీ (అప్పట్లోపీపుల్స్‌వార్) శంకరన్‌ను తూర్పుగోదావరి జిల్లాలో కిడ్నాప్ చేసింది. పేదలు, దళితుల తరపున గట్టిగా వాదనను వినిపించేవారు. బొగ్గు గనులను జాతీయం చేయడంలోనూ, వెట్టి చాకిరీని నిర్మూలించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఆహార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలోని పోలీసు ఎన్‌కౌంటర్లు, నక్సల్ ప్రతి హింసల కారణంగా నెలకొన్న పరిస్థితులతో కలత చెందిన ఆయన శాంతియుత వాతావరణం ఏర్పడేందుకు కృషి చేశారు. 2004లో ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత జరిగిన శాంతి చర్చల్లో ప్రధాన భూమిక పోషించారు. దేశవ్యాప్తంగా ఐటిడిఎల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన కాలంలోనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మార్గదర్శకాలు, నిబంధనలు రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్లకు ఊపిరి పోశారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ఎస్‌సి ఉప ప్రణాళిక (ఎస్‌సి, ఎస్‌టి), గిరిజన ఉప ప్రణాళికలకు (టిఎస్‌పి) రూపకల్పన చేశారు. 2010 అక్టోబర్ 7న హైదరాబాదులో చనిపోయారు. సాంఘిక సంక్షేమ శాఖ ఎస్ఆర్ శంకరన్ జయంతిని అన్ని సంక్షేమ శాఖ వసతి గృహాల్లో నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం. ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, అంజి, పృధ్వి నగర సహాయ కార్యదర్శులు భాస్కర్, యోగి నగర కమిటీ సభ్యులు చరణ్,ప్రదీప్, రమేష్, తరుణ్, అఫ్రోజ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంపిపిపై వీగిన అవిశ్వాసం

- చక్రం తిప్పిన టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు
- పట్టు నిలుపుకోని వైసిపి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఆదోని ఎంపిపి బడాయి దానమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగింది. ఈ విషయంలో టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు చక్రం తిప్పారు. దాదాపు మూడు నెలలుగా ఎంపిపి పీఠంపై నెలకొన్న ఉత్కంఠత బుధవారంతో ముగిసింది. సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన బడాయి పంపాపతి భార్య బడాయి దానమ్మ వైసిపి అభ్యర్థిగా కపటి స్థానం నుంచి పోటీ చేసి ఎంపిటిసిగా గెలిచారు. ఆదోని మండలంలో మొత్తం 29 మంది ఎంపిటిసిలు ఉండగా మండగిరి గ్రామంలో 2, సాదాపురం పంచాయతీలో 1 మినహాయించి 26 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో దిబ్బనకల్లు ఎంపిటిసి, నారాయణపురం ఎంపిటిసి స్థానంలో టిడిపి అభర్థులు గెలుపొందారు. ఎన్నికలు జరిగిన 26 స్థానాల్లో 24 ఎంపిటిసి స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. ఇందులో ఇస్వి, బసరకోడు ఎంపిటిసిలు మృతి చెందారు. ఆరేకల్లు ఎంపిటిసి వైసిపికి రాజీనామా చేశారు. 21 ఎంపిటిసిలకు ఎంపిపి ఎన్నిక కోసం పోటీ జరిగింది. ఇందులో నలుగురు వైసిపి ఎంపిటిసిలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 29 మంది ఎంపిటిసిలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. 2/3వ వంతు వైసిపి మెజారిటీ లేకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ ప్రకటించారు. ఎంపిపి ఎన్నికపై గత కొన్ని రోజులుగా టిడిపి, వైసిపి శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠత నెలకొంది. వైసిపి, టిడిపి ఎవరికి వారు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఎంపిపి పీఠం దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో కూటమికి విజయం లభించింది. ఎంపిపి పదవిని చేజిక్కుంచుకోవడంతో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికకు గైర్హాజరయిన వారిలో ఇద్దరు కిడ్నాప్‌కు గురయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హోసూరు పెద్దహుల్తి దారిలో గాడిదలపై ఎరువులు తీసుకుపోతున్న రైతులు

నేటికీ గాడిదలే ఆధారం...!

ఆ దారి లో వెళ్లాలంటే రైతులు, ప్రయాణికులు అగచాట్లు

ప్రజాశక్తి-పత్తికొండ

'గత్యంతరం లేకపోవడం' అనేది ఒక తెలుగు జాతీయం ...వర్షం వస్తే ఆదారిన వెళ్లలేని పరిస్థితి....తప్పనిసరి వెళ్లాలంటే గాడిదలపైనే వెళ్లాలి. పత్తికొండ మండలం హోసూరునుంచి పెద్దహుల్తి దారిలో వెళ్లాలంటే వాహనదారులు, రైతులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు ఏఇతర వాహనాలు వెళ్లడం సాధ్యంకాదని, అగచాట్లు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి రహదారి హోసూర్ నుండి పెద్దహుల్తి గ్రామానికి సుమారు 3 కిలోమీటర్ల మేరకు గుంతలు పడి రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం వచ్చిందంటే వ్యవసాయ పనులు చేసుకోవాలంటే రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగుచేసిన పంటలకు ఎరువులను చల్లుకోవాలంటే ఆ మార్గంలో ఆటోలు, ఎద్దుల బండ్ల వెళ్లలేని పరిస్థితి ఉంది. రైతులు గాడిదలపై ఆధారపడి పంట పొలాలకు ఎరువులను తీసుకుని వెళు _న్నారు. హోసూర్ నుండి పెద్దహుల్తి మీదగా మంత్రాలయం , ఆదోని వెళ్లే ప్రధాన రహదారికి కలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రయాణికులను, రైతులను, దృష్టిలో ఉంచుకొని రహదారి వేయాలని హోసూరు, పెద్దహుల్తి గ్రామాల రైతులు కోరారు.



పంటకోత ప్రయోగంపై శిక్షణ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలోనీ రైతు సేవా కేంద్రాలలో పని చేసే వ్యవసాయ సహాయకులకు ఎఒ మల్లేష్ కుమార్, ఎఎస్ఒ అదీనారాయణ బుధవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఇందులో భాగంగా పత్తి, కొర్ర, సజ్జ, వేరుశనగ, కంది వంటి పంటలకు రాండం నంబర్లు ఇచ్చారు. ప్రధానంగా ఫారం - 1 ను నింపి పంటల దిగుబడిని లెక్కించాలని పేర్కొన్నారు. పిఎం-ఫసల్ బీమా యోజన కింద వరి పంట దిగుబడి లెక్కింపు కోసం పంట కోత ప్రయోగం చేపట్టాలని, విధుల్లో ఏమాత్రం అలసత్వం తగదన్నారు. రబి సీజన్ సాగు కోసం శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు

అష్ఫాఖుల్లా ఖాన్ స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

అష్ఫాఖుల్లాఖాన్ జయంతి సభలో మాట్లాడుతున్న సత్తార్

ఆర్ఎస్ఎస్, బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు షహీద్ ఎ అష్ఫాఖుల్లా ఖాన్ లాగ పోరాడడానికి అవాజ్ కార్యకర్తలందరూ సిద్ధం కావాలని మాజీ ప్రిన్సిపల్ నిస్సార్ అహమ్మద్, జమాతే ఇస్లామీయా యే హింద్ జిల్లా కార్యదర్శి మునీర్ అహ్మద్‌లు పిలుపునిచ్చారు. కర్నూలు పాత బస్తీలోని సూర్జిత్ భవన్‌లో బుధవారం ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ 125 వ జయంతిని ఎస్ఎండి. షరీఫ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జమాతే ఇస్లాం యే హింద్ జిల్లా కార్యదర్శి మునీర్ అహ్మద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ నిస్సార్ అహమ్మద్, ఆవాజ్ కమిటీ అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్‌లు మాట్లాడారు. అష్ఫాఖుల్లా ఖాన్ 22 1900 అక్టోబర్ 22న ఉత్తర ప్రదేశ్ షాజహాన్ పూర్‌లో పుట్టారన్నారు. అప్పటికి ఆయన తండ్రి బ్రిటిష్ ఆర్మీలో ఉన్నతాధికారిగా పనిచేసేవారన్నారు. ఆయన 8వ రతగతి చదువుతున్న సమయంలో ఆయన చదివే పాఠశాలను నిషేధించారన్నారు. అక్కడ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ముద్రణలు జరుగుతున్నాయని తెలిసి నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆ పాఠశాలలను నిషేధించిందని తెలిపారు. ఆ విషయం ఈయనపై తీవ్రమైన ప్రభావం చూపిందని, అప్పటినుండే ఆయన స్వాతంత్ర సమర లోకి వచ్చారన్నారు. రాంప్రసాద్ బిస్మిల్‌తో కలిసి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. రాంప్రసాద్ బిస్మిల్ ఇతనిది చాలా గాడమైన విడదీయరాని స్నేహబంధం వద్దని వీరిద్దరూ ఒకేసారి వేర్వేరు ప్రాంతాలలో ఉరి తీయబడ్డారని అయినప్పటికీ వీరి మధ్య ఏనాడు కూడా హిందూ, ముస్లిం అనే భేద భావం రాలేదన్నారు. నాడు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలనే లక్ష్యమే తప్ప జాతుల, మతాల ,కులాల, ప్రాంతీయ తత్వాల భేదభావం ఉండేదే కాదన్నారు. నాడు హిందూ ముస్లింలు కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర సర్కార్‌లోని బిజెపి నాయకులు, ఆర్ఎస్ఎస్ నాయకులు ఏ ఒక్కరంటే ఒక్కరు కూడా కించిత్ పాత్ర కూడా స్వాతంత్ర్య పోరాటం లేదన్నారు. నాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ కనుసన్నులలో నడుస్తున్న బిజెపి సర్కార్ పై ప్రజలందరూ కలిసి మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలన్నారు. పిలుపునిచ్చారు. హెడ్మాస్టర్ సత్తార్ మాట్లాడారు. ఈ జయంతి సభ లో మైనారిటీ కాలేజ్ లెక్చరర్ అంజాద్‌అలీ ,ఆవాజ్ నాయకులు డి.అబ్దుల్ దేశాయ్, మహేముద్,షేక్ అహ్మద్, జుబేర్, గౌస్‌బాషా, ఖలీల్, ముక్తియార్, ఫయాజుల్ కరీం, చాంద్ బాషా, ఇలియాస్ ,షాషావలి, అబ్దుల్ రెహమాన్, షేక్ మూసమియా, చాంద్‌బాషా ,మహమ్మద్ హుస్సేన్, శాలిబాష ,బాబులి, హాజీ బాష, నూర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదు'

ప్రజాశక్తి-కకర్నూలు క్రైమ్ : బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసిపి నాయకులకు లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. కర్నూలు లోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ సంఘం దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు షణ్ముఖంతో పాటు బీసీ నేతలు పాల్గొన్నారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై బీసీలు ఆందోళనలు చేసి 42 శాతం రిజర్వేషన్లు సాధించారని కొందరు కుట్ర చేసి రిజర్వేషన్లు అందకుండా చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు 26 శాతం నుంచి 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారని తెలిపారు. వైసిపి నాయకులు బీసీ రిజర్వేషన్లపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సిఎం చెప్పారన్నారు. షణ్ముఖం మాట్లాడుతూ టిడిపి అవిర్భావమే బీసీల అభివృద్ధి కోసం అన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. బీసీ నేతలు రాంబాబు, సుజాత పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

నగరపాలక యంత్రాంగానికి కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖజారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో, నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ యుద్ధ ప్రాతిపదికన సహాయక, పునరావాస ఏర్పాట్ల చేపట్టాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండి, తమ విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి కమిషనర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకరమైన శిథిలావస్థలో ఉన్న భవనాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి, తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. నగరంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా, డ్రెయినేజీలు, కాలువల్లోని పూడిక, అడ్డంకులను వెంటనే తొలగించి నీరు సాఫీగా పారేలా చూడాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ, ఆర్అండ్‌బి, నీటిపారుదల, విద్యుత్ వంటి అన్ని శాఖల అధికారులతో నియమింపబడిన నోడల్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నోడల్ అధికారులు, ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది,వార్డు కార్యదర్శులు విధుల్లో ఉండి తమ పరిధిలోని ప్రాంతాలను గంట గంటకు పర్యవేక్షించాలని, తాత్కాలిక పునరావాస కేంద్రాల్లో ఉండేవారికి తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, సందేహాలు స్వీకరించడానికి కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో నెంబర్ 08518221847 లేదా 7422992299 లకు కాల్ చేయాలని కోరారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు నగరపాలక సంస్థ అధికారుల, సిబ్బంది సెలవును రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జెసి నూరుల్‌కమర్ , డిఆర్ఒ

సిఎం ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ఇల్లు లేని వారికి ఇంటి సౌకర్యం కల్పించడంపై ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని సిసిఎల్ఎ జయలక్ష్మి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవార విజయవాడ నుండి సిసిఎల్ఎ జయలక్ష్మి అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ , సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కర్నూలు జిల్లాకు వచ్చినప్పుడు ఇచ్చిన వాగ్దానాలపై చర్యలు తీసుకుంటున్నామని వాటిపై నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ సిసిఎల్‌కు తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్‌కమర్ , డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి , ఆర్‌డిఒ సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగప్రసూన, సునీతబాయి, ఎడి సర్వే మునికన్నన్, తాహశీల్దార్ శ్రీనాథ్, సూపరిండెంట్ ప్రకాష్‌బాబు వారు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టండి: కలెక్టర్

జిల్లాలో అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాలను పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు .

అనుమానాస్పదస్థితిలో మహిళ హత్య

క్లూస్ టీమ్‌తో పోలీసుల గాలింపు

ప్రజాశక్తి -వెల్దుర్తి



షేక్ ఉస్మా (ఫైల్)

మహిళ దారుణ హత్యకు గురైన గటన వెల్దుర్తిలోని 14వ వార్డులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు షేక్‌ఉస్మా (35) బుధవారం ఇంటిలో హత్యకు గురైంది. ఆమెకు భర్త మస్తాన్, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త బతుకుతెరువుకై ఇతర ప్రాంతానికి వెళ్ళినట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్లిన కుమారుడు సాయంత్రం తిరిగివచ్చి ఇంటిదగ్గర చూడగా తాళం వేసి ఉండడంతో చాలాసేపు వేచిచూసి అక్కతో కలిసి తాళం పగల కొట్టారు. ఇంటిలోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులలో పడి ఉన్న తల్లిని చూసి భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చిచూసి పోలీసులకు సమాచారమిచ్చారు. వెల్దుర్తి సిఐ మధుసూదన్, ఎస్ఐ అశోక్, ట్రైన్ ఎస్ఐ శ్రీవిద్య వారి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరిన్ని వివరాల సేకరణ కోసం క్లూజ్ టీంనురప్పిస్తున్నట్లుతెలిపారు. ఎవరు,ఎందుకుహత్యచేశారనేది తేలాల్సిఉంది.

తాగునీటి సమస్య రానివ్వం

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, చైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ బీటీ, చైర్మన్ లోకేశ్వరి

ఆదోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా శాశ్వత చర్యలు చేపడతామని మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యులు, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, మున్సిపల్ చైర్పన్ లోకేశ్వరి తెలిపారు. బుధవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పటిష్టత పనులకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ మాట్లాడారు. ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం మరిన్ని నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు జారిపోయి పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేయని దుస్థితిలో ఉందని, ప్రస్తుతం అధికారులు రూ.1.20 కోట్లతో తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ట్యాంకు మరమ్మతుల కోసం అధికారులు నివేదికలు సిద్ధం చేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు. టిడిపి మున్సిపల్ విభాగం కార్యదర్శి నాగరాజు, నాయకులు విట్టా రమేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయ్, కౌన్సిలర్ సురేష్, డిఇ వెంకట చలపతి, ఎఇ బ్యూలా పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి

- వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

మాట్లాడుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు ఎమ్.వీరన్న డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల సమావేశం సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఉల్లి, పత్తి, కంది, ఆముదం, టమోటా తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఎకరాకు రూ.60 వేల నుంచి 90 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరారు. శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులకు రైతులతో కలిసి వినతిపత్రాలు అందించాలని, సోమవారం రాజకీయ పార్టీలకతీతంగా రైతులతో కలిసి భారీ ర్యాలీ, అనంతరం వ్యవసాయ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. నాయకులు వై.శేఖర్, రషీద్, కె.భాస్కర్, గిడ్డయ్య, బాషా పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా..!

- ప్రజా సమస్యలు పట్టని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఆలూరు

ఖాళీగా ఉన్న కుర్చీలు

కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపిపి జె.రంగమ్మ, ఎంపిడిఒ బాలస్వామి తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి మండలంలోని సమస్యల పైనా, అభివృద్ధిపైనా ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకొని తదుపరి కార్యాచరణపై దృష్టి సారించాల్సి ఉంది. బుధవారం ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన జరగాల్సిన మండల సమావేశానికి ప్రధానంగా ఉండాల్సిన వారు రాలేదు. మండలంలో 16 మంది ఎంపిటిసిలుండగా ఆలూరులోని 5వ వార్డు ఎంపిటిసి సుభాషిణి (బేబమ్మ) మృతి చెందారు. మిగిలిన 15 మందిలో 8 మంది సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలి. ఎంపిపితో కలిపి ముగ్గురు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపిపి రంగమ్మ తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన ఎంపిటిసిలు సమావేశానికి రాకపోతే ఎలా అంటూ ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. ప్రజలకు సేవలందించలేని ప్రజా ప్రతినిధులు, అధికారులు అధికారం నుంచి తప్పుకోవాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు తెలిపారు.

డార్మెటరీ హాలు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో భక్తుల సౌకర్యార్థం రూ.10 కోట్లతో సుమారు 3 వేల మంది భక్తుల వసతి కోసం నిర్మించ తలపెట్టిన 3 అంతస్తుల డార్మెటరీ హాల్ నిర్మాణానికి పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులతో కలిసి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ భూమి పూజ చేశారు. బుధవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న ఆయన శ్రీమఠం నిధులతో నిర్మించడానికి ప్రణాళిక రూపొందించి శంకుస్థాపన చేసి శిలాఫలకం ప్రారంభించారు. అంతకుముందు శ్రీమఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలను, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, శ్రీపరిమళ పుష్కరిణిని సందర్శించారు. కర్ణాటక మంత్రి బోసరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్, బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, వాణిజ్య విభాగం నాయకులు భరద్వాజ్ శెట్టి, మఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోష్టి, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న శివకుమార్

శ్రీమఠంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి పూజలు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని డికె.శివకుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం, జ్ఞాపికను అందజేశారు.

నకిలీ ఐడితో భద్రత సిబ్బందిని బోల్తా కొట్టించిన ఘనుడు

ప్రజాశక్తి - ఆదోని

మోడీని కలిసిన బిజెపి నాయకుడు (ఫైల్)

నకిలీ ఐడితో పిఎం భద్రత అధికారులను బోల్తా కొట్టించిన ఘనుడు బిజెపి నాయకుడు, ఆదోని వాసి. ఈనెల 16న ఓర్వకల్లు వద్ద ప్రధాని మోడీ సభ జరిగింది. బహిరంగ సభకు ముందు ప్రధానమంత్రి మోడీని కలిసేందుకు కొందరికి అనుమతి ఇచ్చారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి సహచరుడంటూ చెప్పుకుని తిరిగే నాయకుడు వేరొకరి విఐపి పాస్ పేరుతో గ్యాలరీలో చేరి మోడీని కలిసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదే పార్టీకి చెందిన వారు సైతం ఆ వ్యక్తి తీరును తప్పుపడుతున్నారు. ప్రజా సమస్యల గురించి గళమెత్తిన కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల నాయకులను భద్రత దృష్ట్యా ముందస్తు అరెస్టు చేస్తున్న ప్రభుత్వానికి నకిలీ ఐడితో పిఎంను కలవడానికి ఆ వ్యక్తికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా జిల్లా అధికారులను వివరణ కోరినట్లు తెలిసింది.

ఉప కేంద్రం మరమ్మతులకు ఆదేశాలు

- ప్రజాశక్తి పత్రిక కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు గ్రామంలో ముళ్లపొదల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి మరమ్మతులు చేసేందుకు ఆదేశాలు ఇస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శాంతికళ బుధవారం తెలిపారు. 'ముళ్లపొదల్లో ఆరోగ్యం' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 17న కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కింద వచ్చే నిధులతో మరమ్మతు పనులను చేయించి ప్రజలకు, మహిళలకు అందుబాటులోకి తెస్తామని డిఎంహెచ్ఒ తెలిపారు.

డ్రగ్స్ ఫ్రీ సమాజం కోసం కృషి

- ఈగల్ సెల్ ఎస్ఐ సుజన్ కుమార్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించి కృషి చేయాలని ఈగల్ సెల్ ఎస్ఐ సుజన్ కుమార్, సిబ్బంది రమేష్, శక్తి టీం నాగన్న కోరారు. బుధవారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పీడీ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి యువతలో మత్తు పదార్థాల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవకుండా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అవలంబించాలని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం ప్రతిజ్ఞ చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గూడూరు బైపాస్ రోడ్డు సర్కిల్‌లో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే మహబూబ్ నగర్ కాలనీలో రోడ్డు, డ్రెయిన్, వీధి దీపాల ఏర్పాటుకు పరిశీలించారు. డిఇఇ నీరజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

'సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెండేకల్లు ఈరన్న అధ్యక్షతన మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో చేసిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై చర్చించారు. మండలాభివృద్ధికి కావాల్సిన నిధులపై జిల్లా అధికారులకు తెలియజేసి పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మండలంలో సమస్యలు రాబోయే మండల సమావేశం లోపు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామన్నారు.

బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలోని 167వ జాతీయ రహదారి కట్ట వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం నాయకులు కృష్ణ కోరారు. బుధవారం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ... అటు బళ్లారికి, ఇటు ఆదోనికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారని తెలిపారు. చింతకుంటలో 20 రోజుల నుంచి విద్యుత్ సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు. ఆదోని నుంచి చింతకుంట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దుర్గా, తిక్కన్న, బసప్ప, తిప్పయ్య, ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు.

చర్చిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చర్చిలో 'బడి'

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సాతనూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్.కొట్టాల గ్రామంలో క్రీస్తు సంఘం చర్చిలో బడి కొనసాగుతోంది. గ్రామంలో ఉన్న పాఠశాల గతంలో పెచ్చులూడి, శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాత పాఠశాలకు తాళమేసి చర్చిలో తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు మొత్తం 25 మంది విద్యార్థులు ఉన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు. గతంలో అధికారులకు తెలియజేసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి గ్రామంలో నూతన పాఠశాల నిర్మాణ పనులు చేపట్టి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు దేవన్న, గ్రామస్తులు కోరారు.

IN THE COURT OF THE PRL.JR.CIVIL JUDGE : KURNOOL
O.S.NO.766/2024

J.Parameswaraiah. ...Plaintiff
-Vs-
K.Rajeswar Rao
S/o Keshava Kumar,
Business, H.No.4/100,
Kranthi Nagar, Nandyal. ...Defendant

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥7,45,337.00లు, ముందు వడ్డీ, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీవు 4.12.2025వ తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణ ఉన్న తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఆర్. మురళీకృష్ణ,
వాది పరం అద్వకటు, కర్నూలు.

పబ్లిక్ నోటీసు
గౌరవనీయ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు (సీనియర్ డివిజన్) కోర్టులో : కర్నూలు
IA NO:358/2024 IN IP : 44/2024

మధ్య :
బి.షంషీర్ ఖాన్ ...పిటిషనర్
మరియు
ఎస్.జగనాథ్ గుప్తా మరియు 6 ఇతరులు ...ప్రతివాదులు
విషయం :
కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ (సీనియర్ డివిజన్) ఆదేశాల ప్రకారం, బి.షంషీర్ ఖాన్ ప్రతివాదులు నంబర్ 4 (నయీం పాషా, S/o. సయ్యద్ యాసీన్ ఇబ్రహీం, 5. (**B.K.మధు.** S/o. B.K.పెద్ద నాగన్న,) మరియు 6. J. **అబ్దుల్ హక్,** S/o. J. అహమ్మద్ హుస్సానిన్) ఉన్న అప్పులకు బి.షంషీర్ ఖాన్ దివాలా తీసినట్లు ప్రకటించాలని **దివాలా పిటిషన్ నెంబర్ 44/2024** దాఖలు చేశారని, ఈ కేసు తదుపరి **తేదీ: 19/11/2025కి** వాయిదా పడింది. అందువల్ల మీరు నేరుగా లేదా న్యాయవాది ద్వారా గౌరవనీయ కోర్టు ముందు హాజరు కావాలి. లేకుంటే ఈ విషయం పిటిషనర్‌కు అనుకూలంగా నిర్ణయించబడుతుంది.
విచారణ తేది : 19/11/2025
కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆదేశాల ప్రకారం
ప్రచురించినది
P.S. RAO & ASSOCIATES, Kurnool.
MOB: 9346935341

పబ్లిక్ నోటీసు
గౌరవనీయ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు (సీనియర్ డివిజన్) కోర్టులో : కర్నూలు
IP : 44/2024

మధ్య :
బి.షంషీర్ ఖాన్ ...పిటిషనర్
మరియు
ఎస్.జగనాథ్ గుప్తా మరియు 6 ఇతరులు ...ప్రతివాదులు
విషయం :
కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ (సీనియర్ డివిజన్) ఆదేశాల ప్రకారం, బి.షంషీర్ ఖాన్ ప్రతివాదులు నంబర్ 4 (నయీం పాషా, S/o. సయ్యద్ యాసీన్ ఇబ్రహీం, 5. (**B.K.మధు.** S/o. B.K.పెద్ద నాగన్న,) మరియు 6. J. **అబ్దుల్ హక్,** S/o. J. అహమ్మద్ హుస్సానిన్) ఉన్న అప్పులకు బి. షంషీర్ ఖాన్ దివాలా తీసినట్లు ప్రకటించాలని **దివాలా పిటిషన్ నెంబర్ 44/2024** దాఖలు చేశారని, ఈ కేసు తదుపరి **తేదీ: 19/11/2025కి** వాయిదా పడింది. అందువల్ల మీరు నేరుగా లేదా న్యాయవాది ద్వారా గౌరవనీయ కోర్టు ముందు హాజరు కావాలి. లేకుంటే ఈ విషయం పిటిషనర్‌కు అనుకూలంగా నిర్ణయించబడుతుంది.
విచారణ తేది : 19/11/2025
కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆదేశాల ప్రకారం
ప్రచురించినది
P.S. RAO & ASSOCIATES, Kurnool.
MOB: 9346935341

మహారాజశ్రీ గౌరవనీయులైన VII వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.
KURNOOL
E.P. No. 176 of 2025 in A.A. No. 566 /2023
Between:-
M/S Shriram Transport Finance Co. limited.,
Rep. by its GPA Holder Sri. Harikrishna Achary.
...Decree Holder
Versus
Jdr1.
M. Raja. S/O. Yakob
H.No. 5/83, Ambedkar Nagar
Dinnedevarapadu Village,
Kurnool Mandal & Dist.
Jdr2.
Syed Basha. S/O. Jamaluddin
H.No. 8/51, Aswathapuram, Dupadu Village
Kalluru Mandal, Kurnool Dist.
...Judgment Debtors

1,2వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 సి.పి.సి. నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1,2 వ ప్రతివాదులైన (JDr.1&2) మీ పైనా ఆర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule.37, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి ఎయెదుట 23-10-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు kurnool కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

PD: 23.10.2025

Sri. N.SANJEEVA RAYUDU
Sri. V.THIRUPALU
Dhr తరపు న్యాయవాదులు, Kurnool,

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఈనెల 25, 26వ తేదీల్లో కర్నూలు నగరంలో జరిగే సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సిఐటియు మండల నాయకులు హెచ్.జయరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పులు చేస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. 8 గంటల పని విధానానికి ఎంతో చరిత్ర ఉందని, ఆ విధానానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారుల మెప్పు కోసం రాత్రి షిఫ్టులలో కూడా మహిళలతో పని చేయించడానికి చట్టాలను సవరించిందని తెలిపారు. కార్మికులు, మహిళల మనోభావాలను కించపరుస్తూ చేసిన ఈ చట్టాలు రద్దయ్యే వరకు కార్మిక వర్గం పోరాటం చేయక తప్పదని అన్నారు. కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో జరిగే సిఐటియు 13వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు మండల నాయకులు విశాలాక్షి, ప్రకాష్, లక్ష్మన్న, కల్యాణి పాల్గొన్నారు. అనంతరం సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా భీమేశ్వరి, కో కన్వీనర్లుగా విశాలాక్షి, పుష్పలత, ప్రాణేష్, లక్ష్మన్న, కమిటీ సభ్యులుగా సురేష్, మారెప్ప, ప్రకాశం, ప్రసంగి, ఉమామహేశ్వరి, కల్యాణి, జానకి, భారతి, స్వప్న ఎన్నికయినట్లు సిఐటియు మండల నాయకులు జయరాజ్ తెలిపారు. **కౌతాళంలోని** సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల నాయకులు నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు మాట్లాడారు. కార్మిక సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడుదారుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శించారు. రైతుసంఘం జిల్లా నాయకులు కె.మల్లయ్య, ఎం.వీరన్న, వలీ పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న అంజిబాబు

కౌతాళంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

దేవనకొండ బస్టాండ్‌పై నిర్లక్ష్యం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- దేవనకొండ

పత్తికొండ డిపో పరిధిలో అత్యంత రద్దీతో కూడిన దేవనకొండ బస్టాండ్‌పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, మండల కార్యదర్శి మహేంద్ర విమర్శించారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ బుధవారం డివైఎఫ్ఐ మండల నాయకులు జి.నాగేంద్ర ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం వల్ల బస్టాండ్ దుర్గంధమయంగా, పశువులకు ఆవాసంగా మారిందని తెలిపారు. టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం ఘోరంగా ఉందని, దీనికి ఆర్‌టిసి అధికారులదే బాధ్యత అని చెప్పారు. దేవనకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల శాతం ఎక్కువగా ఉంటుందని, బస్టాండ్ నుంచి రోజువారీగా వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని చెప్పారు. కూర్చోవడానికి కూడా వీల్లేదని, దుమ్ము, దూళి, దుర్గంధంతో బస్టాండ్ భయంకరంగా ఉంటుందని తెలిపారు. బాత్‌రూములు, టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయిన, ఈ మధ్య వీటిని మూసేశారని చెప్పారు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే ప్రయాణికులను కూడగట్టి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వ్యకాసి జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ మద్దతు తెలిపారు. కర్నూలు రీజినల్ మేనేజర్‌కు, పత్తికొండ డిపో మేనేజర్‌కు ఆర్‌టిసి సిబ్బంది ద్వారా, దేవనకొండ తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. డివైఎఫ్ఐ నాయకులు వీరేంద్ర నాయుడు, రంగన్న, రంగడు, మహేష్, దిలీప్, దేవేంద్ర, సోమశేఖర్, వెంకటేష్ యాదవ్, కుమార్ పాల్గొన్నారు.

రాస్తారోకో చేపడుతున్న నాయకులు



చెక్కులను పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి తెలిపారు. బుధవారం వైకుంఠం జ్యోతి నివాసంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి సంబంధించిన లబ్ధిదారులు లక్ష్మీదేవి, కేసరి సుంకమ్మ, వడ్డే రామాంజినికి సాగునీటి సంఘం డిసి అధ్యక్షులు నగరడోన కిష్టప్ప, టిడిపి మాజీ కన్వీనర్ వైకుంఠం వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొండా రామాంజనేయులు, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ... నిరుపేదలను ఆర్థికంగా ఆదుకొని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యకర్తల కోసం, పార్టీ కోసం పని చేసే వారి కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి వారికి న్యాయం చేస్తారన్నారు. అశోక్ యాదవ్, నంచర్ల తిమ్మప్ప పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని వరిముక్కల గ్రామానికి చెందిన గొల్ల సరస్వతికి టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి చేతులమీదుగా రూ.45 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, బండపల్లి శ్రీనివాసులు, పొట్లపాడు అశోక్ పాల్గొన్నారు.

ప్రారంభమైన వలసలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో వ్యవసాయ పనులు ముగియడంతో వ్యవసాయ కూలీలు, రైతులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. బుధవారం మండలంలోని గుడిమి రాళ్ల గ్రామానికి చెందిన 20 వ్యవసాయ కుటుంబాలు కర్ణాటక ప్రాంతానికి పత్తి, మిరప పంటల పనులకు వెళ్లాయి. మండలంలోని పి.కోటకొండ, దేవనకొండ, నేలతలమర్రి, గుండ్ల కొండ, కుంకనూరు, పాలకుర్తి, తెర్నేకల్లు, కప్పట్రాళ్ల తదితర గ్రామాల నుంచి తెలంగాణ, గుంటూరు, కర్ణాటక ప్రాంతాలకు వలసలు ప్రారంభమయ్యాయి. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కూటమి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆదోని ఎంపిపి దానమ్మపై వైసిపి ఎంపిటిసిలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఆలింగనం చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు గృహం చేరుకొని నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. గ్రామాల్లో టిడిపికి బలమైన కేడర్ ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసిపికి ఇక గడ్డుకాలమేనని తెలిపారు. సర్పంచి, ఎంపిటిసి, కౌన్సిలర్ ఎన్నికల్లో కూడా కలిసికట్టుగా పనిచేసి కైవసం చేసుకుంటామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో గ్రామాలాభివృద్ధిని విస్మరించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా వన్ టౌన్ సిఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాయకులు మారుతి నాయుడు, పట్టణ, మండల అధ్యక్షులు తిమ్మప్ప, శివప్ప, కూటమి నాయకులు విట్టా రమేష్, పంపాపతి, రంగస్వామి నాయుడు ఉన్నారు.

సంబరాలు చేసుకుంటున్న నాయకులు

'చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బికాలప్ప, చేనేత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కరే కృష్ణ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. చేనేతలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి నేతన్నకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల జీవన పరిస్థితులను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు తెలిపారు. చేనేత నాయకులు వెంకటేశ్వర్లు, కె.లక్ష్మన్న, కునిగిరి వెంకటేశ్వర్లు, గడిగే శీను, ఛాయా శ్రీనివాసులు, వీరేష్, ఎల్లప్ప, రాముడు పాల్గొన్నారు.

'గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి'

ప్రజాశక్తి - ఆస్పరి : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల నాయకులు రామాంజనేయులు, రంగస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, వలగొండ, పుటకలమర్రి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మధు రెడ్డి, రాజు, రవి, మల్లికార్జున, బాష, చంద్ర, లింగన్న, కృష్ణ, లక్ష్మన్న పాల్గొన్నారు.

బాధితులకు సాయమందించాలి

- మానవ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని



వినతిపత్రం ఇస్తున్న మృతుని భార్య

దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి కర్రల సమరంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సహాయం అందించాలని మానవ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదోనిలోని అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన మృతుడు ఆంజనేయ భార్య ఈరమ్మతో కలిసి బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 2న రాత్రి దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి పల్లకి సేవ సందర్భంగా కర్రల సమరం జరిగిందని తెలిపారు. అప్పటి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ విధుల్లో భాగంగా, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి దేవరగట్టు బన్ని ఉత్సవం కల్లారా చూశారని చెప్పారు. అక్కడ ఘర్షణ జరిగినప్పుడు తొక్కిసలాట జరగడంతో అంజినయ్య మృతి చెందారన్నారు. మృతుని భార్య ఈరమ్మ మాట్లాడుతూ... దళిత కులానికి చెందిన తాము ఆసరా కోల్పోయామని తెలిపారు. తన భర్త మృతికి కారణం తెలియడానికి, వెంటనే అతని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించాలని కోరారు. అక్కడ జరిగిన తొక్కిసలాటలోనే తన భర్త మృతి చెందారని వాపోయారు. తన భర్త మృతదేహానికి పోస్టుమార్టం చేయించకుండా, అతనికి లేని గుండెపోటును చిత్రించిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని కోరారు.

మంజునాథ్ కుటుంబానికి అండగా ఉంటాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సాతనూరు గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే మంజునాథ్ కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. ఇటీవల వడ్డే మంజునాథ్ తల్లి లక్ష్మీదేవి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం సాతనూరు గ్రామంలోని మంజునాథ్ ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోడీ జిల్లా పర్యటనలో భాగంగా పార్టీ కార్యక్రమాల్లో బిజీగా ఉండడం వల్ల అంత్యక్రియలకు రాలేక పోయానని తెలిపారు. తెలుగు యువత నాయకులు బాపురం సుధీర్ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, సీనియర్ నాయకులు కొండగేని వీరారెడ్డి, నాడిగేని వీరారెడ్డి, పంపాపతి, జంపాపురం కృష్ణారెడ్డి, భూంపల్లి నరసింహులు, పల్లెపాడు చంద్ర, కందుకూరు రామన్న గౌడ్, నరసింహా రెడ్డి, ఎంపిటిసి రాజు, కొట్టాల దేవన్న, చింతకుంట అంపయ్య, ఆర్లబండ రామాంజనేయులు, సాతనూరు ఉల్లిగయ్య, బెళగల్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచి రామయ్య, ఈడిగ భీమయ్య, రాజశేఖర్ రెడ్డి, సల్మాన్ రాజు, హుస్సేని, అంపయ్య, చిర్తనగల్ నరసప్ప, భూంపల్లి నీలకంఠ, రామకృష్ణ, పర్వాని హనుమంతు, దాదా హుస్సేని, మారేష్, దావీదు, కామన్‌దొడ్డి హనుమంతు, వెంకట రెడ్డి ఉన్నారు.

మంజునాథ్‌ను పరామర్శిస్తున్న తిక్కారెడ్డి